# ఆహార సంక్షోభం... కారణాలు

**నేడు ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం ప్రజలను భయపెడుతోంది. ఆహార ధాన్యాలు, పదార్థాల ధరలు వేగంగా పెరుగుతున్నాయి. జనాభా విస్ఫోటం.. ప్రపంచీ కరణ.. ప్రజల ఆహార అలవాట్లలో మార్పులు.. మండుతున్న పెట్రోలు, డీజిలు ధరలు.. వేడెక్కుతున్న భూగోళం- తిండి గింజలు, వంట నూనెల ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు!!**

ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం-ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరం నుంచి ఆహారపదార్థాల ధరలు 75 శాతం, గోధుమల ధరలు 200 శాతం పెరిగాయి. ఒక్క 2007లోనే బియ్యం ధర 75 శాతం, గోధుమల ధర 130 శాతం పెరిగింది. 37 దేశాల్లో ఆహార సమస్య నెలకొంది. పైపైకి దూసుకు పోతున్న ధరల కారణంగా... ప్రపంచవ్యాప్తంగా దాదాపు కోటి మందిదారిద్ర్యంలో మగ్గిపోవాల్సిన పరిస్థితు లేర్పడ్డాయి.

## రికార్డుస్థాయి దిగుబడులు:

ఆహార సంక్షోభానికి ధాన్యం దిగుబడులు తగ్గిపోవడమే కారణమా? లేక జనాభా పెరుగుదల రేటు అంత అధికంగా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. గతేడాది అన్ని దేశాల్లో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి 210 కోట్ల టన్నులు. గతంలో ఎన్నడూ ఇంతగా దిగుబడి లేదు. 2006తో పోల్చితే ఐదు శాతం వృద్ధి కనిపిస్తోంది. ఈ 210 కోట్ల టన్నుల్లో జనం తినడానికి వంద కోట్ల టన్నులు చాలని ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ చెబుతోంది. ఇక జనాభా విషయానికివస్తే.. గత 25-30 ఏళ్లలో ప్రపంచజనాభా విపరీతంగా పెరిగిన మాట నిజమే. 1804 నాటికి నూరు కోట్లున్న ప్రపంచ జనాభా.. 1901కల్లా దాదాపు 170 కోట్లకు పెరిగింది. 20వ శతాబ్దం ముగిసే నాటికి శరవేగంతో 600 కోట్లకు చేరింది. తాజాలెక్కల ప్రకారం.. వచ్చే నెల(మే)లో ఇది 666,66,66,666కు చేరుకుంటుందని అంచనా.

## జనాభా ఒక్కటే కారణంకాదు:

ఆహార సమస్యకు జనసంఖ్య పెరగడం ఒక్కటే కారణం కాదు. ఆహారం కోసం వేటపై ఆధారపడిన మానవుడు..వేల ఏళ్ల క్రితమే వ్యవసాయం చేయడం మొదలెట్టడంతోనే జనాభా పెరగడం ఆరంభమైంది. నేటికీ ప్రపంచ దేశాల్లో ఏటా సాగు భూమి విస్తరిస్తూనే ఉంది. మరెందుకీ తిండి సమస్య? ప్రపంచీకరణ వేగం పుంజుకున్న నేటి పరిస్థితుల్లో.. ఎక్కడ లాభావ కాశాలు కనిపిస్తే.. అక్కడికి మూలధనం పరుగులు తీస్తోంది. పారిశ్రామి కీకరణ, వస్తు సేవల ఉత్పత్తి అన్ని దేశాలకూ విస్తరించింది. సంపదపెరగడంతో పేదరికం తగ్గడం మొదలైంది. జనాభా ఎక్కువగా ఉండే పేదదేశాల్లో ఆకలి సమస్య కొంతమేరతగ్గింది. ఆఫ్రికా ఖండ దేశాల్లోనూ ముడి ఖనిజాల ఎగుమతుల ద్వారా ఆహార సమస్య చాలావరకు పరిష్కార మైందని చెబుతున్నారు.

## విచ్చలవిడి వినియోగం:

స్వేచ్ఛా మార్కెట్ విధానాల ఫలితంగా సహజవనరుల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. గతంలో అంతంత మాత్రంగానే ఆర్థికాభివృద్ధి నమోదు చేసుకున్న బ్రెజిల్, భారత్ , ఇండోనేషియా, థాయిలాండ్ వంటి దేశాల్లో... ధనిక, మధ్య తరగతి ప్రజల ఆదాయం పెరిగింది. దాంతో ఆహార పదార్థాల వినిమయం ఊపందుకుంది. వృద్ధి రేటు అధికంగా ఉన్న ఐటీ, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో పనిచేసే ప్రజల జీవనశైలి మారిపోయింది. పాశ్చాత్య జీవనసరళి ప్రత్యక్షమైంది. ఆదాయాలు పెరగడంతో.. విందులు, వినోదాలు ఎక్కువ య్యాయి. ఫలితంగా ఆహార పదార్థాల దుబారా కూడా అంచనాలను మించిపోయింది.

## వేడెక్కుతున్న వాతావరణ:

పారిశ్రామీకరణ ఇంధన వినియోగాన్ని విపరీతంగా పెంచేసింది. వాతావరణం వేడెక్కడంతో.. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పంటల దిగుబడి తగ్గడం ప్రారంభమైంది. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా.. ముడి చమురు ధర బ్యారల్ వంద డాలర్లకు మించిపోయింది. ఆధునిక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో సుదీర్ఘకాలం ఆర్థికాభివృద్ధిని కొనసాగించిన అమెరికాలోనూ.. ఇటీవల ఆర్థిక ప్రగతి మందగించింది. అగ్రరాజ్యంలో తాకట్టు రుణాల సంక్షోభం వల్ల ప్రపంచ పెట్టుబడులు ఆహారధాన్యాలు వంటి సరకుల మార్కెట్లోకి ప్రవేశించాయనీ.. ఆహారపదార్థాల ధరలు ఆకాశంవైపు పరుగులు తీయడానికి ఇది కూడా ప్రధాన కారణమని నిపుణులు అంచనావేస్తున్నారు.

## బెడిసికొట్టిన జీవ ఇంధన ప్రయోగం:

ముడిచమురు ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు వాహనాల్లో జీవ ఇంధనాలను వినియోగించాలన్న ప్రయత్నం బెడిసికొట్టింది. జీవ ఇంధనాల ఉత్పత్తికి అవసరమైన పంటల కోసం భారీ విస్తీర్ణంలో పొలాలను వినియోగించడంవల్ల ఆహార ధాన్యాల దిగుబడి గణనీయంగా పడిపోయింది. గతేడాది అమెరికా జొన్న పంటలో నాలుగో వంతు ఇధనాల్‌గా మారిపోయింది. పారిశ్రామిక దేశాలైన అమెరికా, బ్రిటన్, ఇతర ఐరోపా రాజ్యాల మద్దతుతో సాగిన ప్రయోగం సాగిలబడి నట్టేనని భావిస్తున్నారు. తిండిగింజల ధరలు పెరిగి, నిల్వలు మందగిస్తున్న సమయంలో జీవ ఇంధనాల వాడకం ఆహార కొరతను తీవ్రం చేసింది. ముంచుకొస్తున్న ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచదేశాలు సిద్ధమవుతున్నాయి. ఐక్య రాజ్యసమితి అనుబంధ సంస్థలూ, ప్రపంచ బ్యాంకూ పరిష్కార మార్గాలు అన్వేషించే పనిలోపడ్డాయి!!

–నాంచారయ్య మెరుగుమాల